సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్హత ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జనవరి 9వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్, పైథాన్, ఎథికల్ హ్యాకింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ ఇలా 100కి పైగా సర్టిఫికెషన్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 95058 00050.

క్రీడల్లో దేశానికి మంచి పేరు తీసుకురావాలి

కవాడిగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కవాడిగూడ దోమలగూడకు చెందిన వీరమల్ల మేఘన సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా సోమవారం దోమలగూడలోని గుడాల బస్తీలో ఆమె నివాసానికి వెళ్లి కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీజేపీ నేతలు చిన్నారి మేఘనను శాలువా మెమెంటోతో అందజేసి ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు గంటా శ్రీనివాస్, ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

12 ఏళ్లుగా నిత్యాన్నదానం

ముషీరాబాద్: అయ్యప్ప స్వాములకు 12 ఏళ్లుగా నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వీర మణికంఠ సేవా సమితి అధ్యక్షుడు కోడూరు రాజు తెలిపారు. సోమవారం ముషీరాబాద్‌లోని పోల్‌బాల్ ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ చేశారు. అనంతరం సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాజు, రాజ్‌కుమార్, నందికంటి గోపాల్‌రావు, జె.ఎస్.పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

ముషీరాబాద్: బాధ్యతతో మెరుగైన సేవలు అందించినప్పుడే సమాజంలో చిరకాలం గుర్తుండిపోతారని జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి అన్నారు. సోమవారం ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో చిరంజీవి ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై చిరంజీవి దంపతులను సన్మానించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొండా విఠల్‌రెడ్డి సేవలు మరువలేనివి

ముషీరాబాద్: కొండా విఠల్‌రెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేశారని ఆయన అందించిన సేవలు మరువలేనివని రాంబాబుయాదవ్ అన్నారు. సోమవారం దివంగత నేత కొండా విఠల్‌రెడ్డి వర్ధంతిని వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'నాన్నమ్మ మృతిపై అనుమానాలు ఉన్నాయి'

మనవరాలి ఫిర్యాదుతో ఉస్మానియాకు మృతదేహం తరలింపు

కాచిగూడ: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక ప్రాంతానికి చెందిన చెందిన బాలమ్మ సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చే వరకు నాన్నమ్మ అంత్యక్రియలు నిర్వహించవద్దని మనవరాలు సుజాత కోరింది. అయినా ఏర్పాట్లు చేస్తుండటంతో ఆమె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మనవరాలు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.

రైల్లో బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: రైలు ప్రయాణికురాలి ఆభరణాల చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప వివరాల ప్రకారం.. అనకాపల్లికి చెందిన అక్కమ్మ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం అజంతా ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు వస్తుంది. రైలు ముత్కేడ్ వద్దకు రాగానే తన వద్ద ఉన్న బ్యాగ్ చోరీకి గురైంది. బ్యాగులో 33 గ్రాముల కాసులహారం గొలుసు, సెల్‌ఫోన్ ఉంది. సోమవారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. విశాఖపట్నంకు చెందిన హసిక ఆదివారం ఢిల్లీ నుంచి కాచిగూడకు ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుంది. ఫరీదాబాద్ స్టేషన్ వద్ద ఆమె ల్యాప్‌టాప్ బ్యాగు చోరీకి గురైంది. సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కేసును హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వరం

ఉచిత డయాలసిస్ కేంద్రం

- అంబర్‌పేట నియోజకవర్గంలో అందుబాటులోకి డయాలసిస్ సెంటర్
- మున్సిపల్‌కాలనీలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు
- రూ.కోటితో కేంద్రం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కాలేరు
- ముందస్తు రిజిస్ట్రేషన్‌తో డయాలసిస్ సెంటర్ సేవలు



ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్

అంబర్‌పేట: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచిత డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. వేల రూపాయాలు వెచ్చించి డయాలసిస్ భారం అనుకునే వారికి ఎంతో ఉపశమనం కలిగింది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చొరవతో అంబర్‌పేట నియోజకవర్గం కోసం అధునాతన డయాలసిస్ కేంద్రం ప్రారంభమైంది. అంబర్‌పేట మున్సిపాల్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఐదు పడకల డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఇది ఎంతో దోహదపడుతుంది.

రోగులకు ఆర్థిక ఉపశమనం..

◆ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారు వైద్యుల సూచన మేరకు వారానికి ఒకటి లేదా రెండు దఫాలుగా డయాలసిస్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి డయాలసిస్‌కు రూ.5వేల వరకు ఖర్చు వస్తుంది. నెలకు రూ.20–40వేల వరకు డయాలసిస్‌కు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇంత పెద్ద మొత్తం పేదలకు ఆర్థికంగా పెను భారమే. పేదలకు ఆర్థికంగా ఉపశమనంతో పాటు నాణ్యమైన డయాలసిస్ వైద్య సేవాలు ఈ కేంద్రంతో అందించనున్నారు.

ముందస్తు రిజిస్ట్రేషన్‌తో...

◆ అర్హులైన వారికి ముందస్తు రిజిస్ట్రేషన్‌తో ఈ కేంద్రంలో డయాలసిస్ సేవలు అందిస్తారు. ఆరోగ్యశ్రీ కార్డు, తెల్లరేషన్ కార్డుతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద ముందస్తు మంజూరు పత్రం ఉంటే ఇందులో ఉచిత డయాలసిస్ చేసుకోవచ్చు ప్రస్తుతం నిత్యం పది మంది వరకు డయాలసిస్ చేసుకునే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి వైద్యులు చేసిన సూచనల మేరకు డయాలసిస్ చేస్తారు.

పరికరాలను మళ్లీ వినియోగించకుండా..

◆ డయాలసిస్ కేంద్రాల్లో గతంలో డయాలసిస్ ప్రక్రియలో వినియోగించిన ప్రక్రియను పలుమార్లు వినియోగించేవారు. ఆర్థికంగా భారం తగ్గించుకోవడానికి వాడిన పరికరాలనే వాడేవారు. అందుకు భిన్నంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్రంలో ఒక్కసారి వినియోగించిన పరికరాలను వినియోగించకుండా మెరుగైన డయాలసిస్ ప్రక్రియను చేస్తున్నారు.

రూ. కోటి ఖర్చుతో...

◆ మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రూ.కోటి ఖర్చుతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, ఆస్పత్రి వైద్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గం పేదలు డయాలసిస్ కోసం ఇతర ప్రాంతాల్లో వెళ్లడం, ఆర్థిక భారం తట్టుకోలేక తనువు చాలించిన వార్తలు తన దృష్టికి వచ్చాయన్నారు. దీంతో గత ఏడాది కాలం నుంచి వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గంలో ఉచిత డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చొరవ తీసుకున్నన్నారు. ఎంతో విలువైన డయాలసిస్ సేవాలను పేదలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ దక్షయాణి, వైద్యులు ప్రతిభ, నాగశ్రీ, చంద్రశేఖర్, నిర్వాహకులు అబ్దుల్ ఖాదీర్, బీఆర్ఎస్ నాయకులు రంగు సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రం పనితీరును వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

బహుజన సాహిత్యంతోనే రాజ్యాధికారం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బహుజన సాహిత్యంతోనే రాజ్యాధికారం సమకూరుతుందని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర 7వ వార్షికోత్సవ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ... పూలే, అంబేడ్కర్ భావాజాలానికి అనుగుణంగా పనిచేసే జాతీయ సంస్థ అని వివిధ రంగాలకు చెందిన కళాకారులను ప్రోత్సహించడానికి తమ సంస్థ ద్వారా ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. కళాకారులలో ప్రతిభను గుర్తించి వారిని సత్కరించి ప్రోత్సహించడం వల్ల మన దేశ ప్రగతి ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్, రాష్ట్ర కోఆర్డినేటర్ విష్ణు, బాలయోగి, ఏపీ సలహాదారులు మల్లా ప్రభాత్‌కుమార్, కేరళ రాష్ట్ర నాయకులు షాజీ, యూత్ కాంగ్రెస్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్ని ప్రసంగించారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని అంబేడ్కర్ విద్యా సంస్థల కార్యదర్శి, ఎమ్మెల్యే డాక్టర్ జి. వినోద్ అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో వినోద్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకుంటారో ఆ రంగంలో నైపుణ్యత సాధిస్తే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రమశిక్షణ గల విద్య ఉన్నత శిఖరాలకు చేర్చుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్, డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణు ప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లను 22 శాతానికి పెంచాలి

కాచిగూడ: శాస్త్రీయత లేని ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను సోమవారం మాల మహానాడు ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం 15 శాతం ఉన్న ఎస్సీ రిజర్వేషన్లను 22 శాతానికి పెంచాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అవసరం లేదని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి విరుద్ధమని పేర్కొన్నారు. అంటరానితనం ద్వారా ఏర్పడిన ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ వర్తింపజేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంటే దళితులను శాశ్వతంగా రాజ్యాధికారానికి దూరం చేయడమే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నేతలు కొంద్ర రాజలింగం, అన్నమల్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కమిషన్ జస్టిస్‌కు వినతి పత్రం అందజేస్తున్న గోపోజు రమేష్‌బాబు

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- మేకపోతుల వెంకటరమణ
- 29న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈనెల 29న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి వెంకటరమణ హాజరై మాట్లాడారు. వృత్తిలో ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచం 10వేల మందికి ఇచ్చారన్నారు. మిగిలిన వారికి సైతం ఇవ్వాలని ఆయన కోరారు.

◆ ప్రమాదం జరిగిన వారికి నెల రోజులలోపే ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పి ఏడాదైందన్నారు. ఎక్స్‌గ్రేషియా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నెక్లెస్ రోడ్‌లోని నీరా కేఫ్‌ను టాడి కార్పొరేషన్‌కు అప్పగించాలని, నందనంలోని నీరా ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయాలని, ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

◆ సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... వృత్తి పెన్షన్ రూ.4000కు, ఎక్స్‌గ్రేషియో రూ.10వేలకు పెంచుతామని, ద్విచక్ర వాహనాలు ఇస్తామన్న హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.వెంకటనర్సయ్య, జయరాములు, జంగన్న గౌడ్, పి.అబ్బాలు, వెంకటమల్లయ్య, గౌని వెంకన్న, అబ్బగాని బిక్షం, బూడిద గోపి, ఉప్పలయ్య, రమేష్‌గౌడ్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవలతోనే గుర్తింపు

కాచిగూడ: విధి నిర్వహణలో ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ఉత్తమ సేవలందించడంతోనే సమాజంలో ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. సోమవారం కాచిగూడలోని తుల్జాభవన్‌లో హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా, శ్రీమల్లికార్జున స్వామి దేవస్థానం కొమరవెల్లి ఈవోగా పదవీ విరమణ చేసిన ఎ.బాలాజీకి ఉద్యోగ విరమణ సన్మానోత్సవ అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బాలాజీ నిరాడంబరుడిగా విధి నిర్వహణలో ఖచ్చితత్వంతో ప్రజలకు సేవలందించారన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖలో పని ఒత్తిడులున్నా ఉద్యోగ సంఘం నేతగా ప్రజలకు సేలందించే ఉద్యోగిగా అందరి మన్ననలు పొందారన్నారు. అనంతరం బాలాజీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురాకుల జ్యోతి, ఎంఎండి కృష్ణవేణి, రామకృష్ణారావు, కృష్ణప్రసాద్,ఎస్.అంజనారెడ్డి, నరేందర్, కృష్ణమాచార్యులు, నిఖిల్ సక్సేనా, బాబు శంకర్, ఓం ప్రకాష్, శ్రీనివాస్ శర్మ, పల్లవి, భాస్కర్, వెంకటరమణ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: ప్రైవేట్ విద్యా సంస్థలు పేద విద్యార్థులను గుర్తించి ఉచితంగా విద్యాబోధన అందించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్‌లోని రేడియంట్ హై స్కూల్ నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు జైసింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అహ్మద్ భక్తియార్, ఎండీ ఖదీర్, జావిద్‌ఖాన్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, రాజు, టెంట్‌హౌస్ శ్రీనివాస్, రాకేష్, బల్లా శ్రీనివాస్ రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్ పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

ముషీరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలలో భాగంగా కామారెడ్డిలో జరిగిన బహిరంగ సభలో ప్రకటించిన విధంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు డిమాండ్ చేశారు. సోమవారం ముషీరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం రూ.20వేల కోట్ల బడ్జెట్ బీసీలకు కేటాయిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుంటే బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి ఉద్యమం చేపట్టిన బీసీలను న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, సదానంద్‌ముదిరాజ్, జమాల్‌పురి నందు, సురేష్‌ముదిరాజ్, శ్రీకాంత్, మెట్టు వాసు, శంకర్, నవీన్‌కుమార్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

అంబర్‌పేట: బీఆర్ఎస్ నేత కాలేరు సంతోష్ తల్లి నర్సమ్మ సంతాప సభ సోమవారం గోల్నాకలో జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ హాజరై నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సంతోష్, చారి తదితరులు పాల్గొన్నారు.



పత్రికల్లో వస్తేనే స్పందిస్తారా.?

ఎట్టకేలకు స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు





సాక్షి ఎఫెక్ట్..

సమస్యలు పట్టించుకోండి.! అనే శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎట్టకేలకు స్పందించారు. చెట్లకొమ్మలు, చెత్తాచెదారాన్ని జీహెచ్ఎంసీ, రాంకీ సిబ్బంది తరలించారు. ఈ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా కథనానికి వెంటనే స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడే స్పందించడం కంటే కాలనీలు, బస్తీల్లో తరచూ పర్యటిస్తే సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించవచ్చని స్థానికులు చెబుతున్నారు.

– చిక్కడపల్లి

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అధ్యక్షుడిగా పీవీ నిరంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి



సుందరయ్య పార్కులో ప్రమాణస్వీకారం చేస్తున్న వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం సుందరయ్యపార్కులో అట్టహాసంగా జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా పీవీ నిరంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మనోహర్ రెడ్డి, కోశాధికారిగా ఎం.దశరథ్, ఉపాధ్యక్షుడిగా వి.కళ్యాణ్‌నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎంజీఎఫ్ సిల్వర్ డోనర్ కె.లింగప్రకాష్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిరంజన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ... పార్కు అభివృద్ధితో పాటు వాకర్స్ ఆరోగ్య పరిరక్షణకు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు వెంకటకృష్ణారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు కె.రామానందం, వి.నాగభూషణం, టి.చక్రపాణి, మురళీకృష్ణ, కందూరి కృష్ణ, కె.సంపత్‌రెడ్డి, పి.రాజేంద్రప్రసాద్‌గౌడ్, మాజీ అధ్యక్షులు ఆర్.వివేక్, ఎస్.రమేష్‌రెడ్డి, పి.వెంకట్ స్వామిగౌడ్, వై. శ్రీనివాసాచారి, గంగాధర్‌రెడ్డి తదితరులు ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్నారు.

డ్రైవర్ల ట్రాన్స్‌పోర్టు స్కీమ్‌ను రెన్యూవల్ చేయాలి

కాచిగూడ: రవాణా రంగ కార్మికుల భద్రత కోసం తీసుకువచ్చిన రవాణా డ్రైవర్ల ట్రాన్స్‌పోర్టు స్కీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం రెన్యూవల్ చేసి రవాణా రంగ కార్మికులను ఆదుకోవాలని తెలంగాణ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి గోద మల్లేష్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ... రవాణా రంగ కార్మికుల కోసం గత ప్రభుత్వం 2015లో రవాణా డ్రైవర్ల ట్రాన్స్‌పోర్టు పథకాన్ని అమలు చేసిందన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయలేదన్నారు. దీంతో ప్రమాదాల్లో మృతి చెందిన ఆటోడ్రైవర్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ స్కీమ్‌ను రెన్యూవల్ చేసి కార్మికులకు భద్రతను కల్పించాలని కోరారు. ఈ స్కీమ్‌ను రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలన్నారు. సహజ మరణం, అంగవైకల్యం చెందిన డ్రైవర్లకు రూ.3లక్షల బీమాను అమలు చేయాలని కోరారు. సామాజిక భద్రత బీమా పథకానికి రాజీవ్ డ్రైవర్ బీమా పథకం పేరును పెట్టాలని కోరారు. ప్రమాదాలలో లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్క డ్రైవర్‌కి ఈ బీమాను వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కాచిగూడ: ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడిన రవాణా రంగ కార్మికుల అభివృద్ధి, సంక్షేమ కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శాబంకర్ దయానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నారాయణగూడ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.నర్సింహరెడ్డి, గోద మల్లేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో యూనియన్ గ్రేటర్ కమిటీ ఎన్నిక జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా శాబంకర్ దయానంద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ ఖలీద్, ఉపాధ్యక్షుడిగా నాగమల్లు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా నాగరాజు, జాయింట్ సెక్రటరీగా షేక్ జహంగీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోపాల రమేష్ ఎన్నికయ్యారు. అనంతరం వారికి నియామకపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు పెంచకుండా ఆటో డ్రైవర్లను మోసం చేసిందన్నారు. కొంత మంది ప్రతిపక్ష యూనియన్ల నాయకులు ఆటోడ్రైవర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. వారి మాటలను ఆటో డ్రైవర్లు నమ్మొద్దని సూచించారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న శాబంకర్ దయానంద్

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



చిక్కడపల్లి: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర కనీస వేతన సలహామండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనాలు పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపడుతున్నారన్నారు. కార్మికుల వేతనాలు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుందన్నారు. కార్మికుల ప్రయోజనమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. రాష్ట్రంలో ఉన్న కోటి ఇరవై లక్షల కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచే దిశగా కమిటీ నిర్ణయాలు తీసుకోబోతుందన్నారు. యాజమాన్యం, కార్మికులకు ఆమోదయోగ్యంగా ఉండేలా కనీస వేతనాలను పెంచి అమలయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్, కనీస వేతన మండలి కార్యదర్శి శ్యాంసుందర్‌జాజు, కార్మిక ప్రతినిధి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.నరసింహారెడ్డి , ఎండి యూసుఫ్, రాజు ముదిరాజ్, కశ్యపు రెడ్డి పాల్గొన్నారు.